## గాంధారి పీహెచ్‌సీపై నిర్లక్ష్యమేలా..!



2



2

## మధ్యాహ్న భోజనం తనిఖీ



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 4 నుంచి తెయూలో ఐఎంబీఏ పరీక్షలు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో ఐఎంబీఏ ఆరో సెమిస్టర్ థియరీ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 4 నుండి 13 వరకు జరుగనున్నాయి. ఈ మేరకు కంట్రోలర్ సంపత్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు.

### కొనసాగుతున్న బీఈడీ, బీపీఈడీ పరీక్షలు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, బీపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షలకు 1,354 మందికి 1,330 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



**కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండున్నరేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల్లో కొత్త పనులకు శంకుస్థాపనలు చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నా.. కామారెడ్డిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోవడంతో నిధులు రావడం లేదని ప్రచారం జరుగుతోంది.**

—అక్షరటుడే, కామారెడ్డి



# అభివృద్ధి అంతంతే..!

- కామారెడ్డిపై చిన్న చూపు
- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- ముందుకు సాగని ప్యాకేజీ –22 పనులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కామారెడ్డికి పెద్ద ఎత్తున నిధులు రాలేదనే అభిప్రాయం నెలకొంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పాఠశాలల మరమ్మతులు వంటి ప్రాథమిక పనులకే పరిమితమైంది తప్ప, చెప్పుకోదగ్గ కొత్త ప్రాజెక్టు కనిపించడం లేదు. పక్కనున్న బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు మంజూరైన నిధులతో పోలిస్తే కామారెడ్డికి వచ్చిన కేటాయింపులు చాలా తక్కువ అని స్థానిక నాయకులే అంటున్నారు. ఇక్కడి నాయకులు నిధుల విషయంలో పట్టించుకోకపోవడమేనన్న ప్రచారం సాగుతోంది.

### శంకుస్థాపనలు లేని పరిస్థితి

ప్రభుత్వం మారి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క కొత్త పనికి కూడా స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా కనీసం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయలేదన్న విమర్శలున్నాయి. గతంలో ఏటా కొన్ని వందల కోట్ల పనులకు భూమిపూజలు జరిగేవని, ఇప్పుడు ఆ స్థాయి కార్యక్రమాలే లేకపోవడంతో కార్యకర్తలు, నాయకులు సైతం అసంతృప్తితో ఉన్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో సాగుతోంది.

### బోరుబావులే ఆధారం

కామారెడ్డి రైతులకు సాగునీరే అతిపెద్ద సమస్యగా మారింది. ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు చేపట్టిన ప్యాకేజీ22 పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో నిలిచిపోయాయి. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిలక్ష్యం చేయడంతో నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కేవలం రూ.20 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకుందన్న విమర్శలు



వస్తున్నాయి. దీంతో రైతులు పూర్తిగా బోరుబావులపైనే ఆధారపడాల్సి వస్తోంది. పక్కనున్న మిగతా మూడు నియోజకవర్గాలకు నీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందుతుండగా, కామారెడ్డికి మాత్రం మొండిచెయ్యి చూపుతోంది. మరోవైపు ప్రజల నుంచి వస్తున్న అభివృద్ధి పనుల డిమాండ్‌కు సమాధానం చెప్పలేక స్థానిక నాయకులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు ఫలానా పనికి నిధులు ఇవ్వండని అడిగితే సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతిపాదనలోనే పనులు

కామారెడ్డి జిల్లా కేంద్రం అయినా ఆ స్థాయి అభివృద్ధి లేదన్నది బహిరంగ రహస్యమే. ఇక్కడ ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు టు టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. పట్టణంలో ప్రధాన రోడ్ల వెడల్పు చేపట్టాలని వినతులు వస్తున్నాయి. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రైతులకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు అన్ని వసతులు ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. పట్టణంలో శాశ్వత తాగునీటి ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి ఉన్నా సాగడం లేదన్న విమర్శలున్నాయి. అధికారులు పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించడం లేదు.

### స్పందన కరువు

నియోజకవర్గానికి ప్రత్యేక నిధుల కోసం నాయకులు ప్రయత్నిస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కరువవుతోందన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక నాయకుడిగా ఉన్న షబ్బీర్ అలీ సైతం ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు పంపినట్టుగా తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే సైతం కామారెడ్డికి రింగు రోడ్డు, రోడ్ల విస్తరణ, రైల్వే అభివృద్ధి లాంటి కోట్లాది రూపాయల ప్రతిపాదనలు కేంద్ర మంత్రులకు సమర్పించినా ఇప్పటికి స్పందన లేదు. మరోసారి కేంద్ర మంత్రులను కలిసి విన్నవించే యోచనలో ఎమ్మెల్యే ఉన్నట్టుగా తెలుస్తోంది.

### ఎడ్యుకేషన్ హబ్ ఎక్కడ?

కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఇక్కడున్న కళాశాలలో కొత్త కోర్సులు ఏర్పాటు చేసి నూతన కళాశాలలు మంజూరు చేయాలి. రూ.200 కోట్లతో చేపట్టే ఇంటిగ్రేటెడ్ పాఠశాల నియజకవర్గానికి మంజూరు తేవాలి. ఇక్కడి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం ఆలోచించాలి. ఇక్కడి నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ఎడ్యుకేషన్ హబ్ హామీ మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోకి తీసుకురావడంలో కృషి చేయాలి.

- విఠల్, బీవీఎస్ జిల్లా అధ్యక్షుడు

## తెలంగాణలో బీజేపీ కనుమరుగు



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రంలో బీజేపీ కనుమరుగైందని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని అక్కడక్కడా సీట్లు సాధించిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఖాందేశ్ శ్రీనివాస్ కూతురు వివాహం ఇటీవల జరుగగా.. బుధవారం మంత్రి వారి ఇంటికి వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు.

### పలు రాష్ట్రాల్లో ఓట్లు తారుమారు..

మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ 'సర్' పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేకుల లక్షల సంఖ్యల ఓట్లు తొలగించి ఫలితాలను తారుమారు చేశారన్నారు. తెలంగాణలో సైతం అదేవిధంగా ప్రయత్నం జరిగే అవకాశం ఉందన్నారు. భారత ఎన్నికల కమిషన్ బీజేపీ అనుబంధ సంస్థగా మారిందని ఆయన ఆరోపించారు. 20 ఏళ్లకు ఒకసారి ఈ ప్రక్రియ జరుగుతుందని గతంలో 2002లో ప్రజాస్వామ్య బద్ధంగా అర్హులైన ఓటర్లు మిస్ కాకుండా నిర్వహించారని, ప్రస్తుతం అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రతి ఓటర్ అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణకు వచ్చిన బీజేపీ అధ్యక్షుడు తాను వచ్చినట్లు ప్రజలు మాట్లాడుకోవాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌ను విమర్శించారన్నారు. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత





**అక్షరటుడే, బాల్కొండ/ఆర్మూర్:** మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను బుధవారం తెరిచారు. మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు, కేంద్రజల వనరుల శాఖ అధికారుల సమక్షంలో గేట్లను ఎత్తారు. జూలై 1న బాబ్లీగేట్లు ఎత్తాలని సుప్రీం ఆదేశాలు ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గేట్లు అక్టోబర్ 28 వరకు తెరిచి ఉంచాలని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో 30వ తేదీన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. రాష్ట్రాల అధికారులు అర్ధరాత్రి దాటిన తర్వాత గేట్లను తెరిచారు. దీంతో దిగువకు 0.2 టీఎంసీల నీరు ఎస్సారెస్పీ వైపు వస్తోంది. కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ కమిషన్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చరణ్, జూనియర్ ఇంజినీర్లు సాయి ప్రణీత్, ప్రకాష్, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు బన్సోద్, ఓట్‌దార్, గవాయి, ఎస్సారెస్పీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కొత్త రవి, శ్యాం కుమార్, విన్యాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో సేవలను వినియోగించుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు:** పేదలు ప్రభుత్వాస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అనవసరంగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి అప్పులపాలు కావద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు గడిచినా.. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. కొత్త పెన్షన్లు లేవని, ఆరోగ్యశ్రీ బిల్లులు సరిగా రావడం లేదని మండిపడ్డారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ, ఉద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్స్ ఏవీ అమలు కావడం లేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలన్నీ సక్రమంగా అమలవుతున్నాయని చెప్పారు.

### ఆరోగ్య సమస్యలతో సంప్రదిస్తే..

ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే



ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాద్‌లోని బీబీనగర్‌లో గల ఏయిమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్‌లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసీ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, విజయ మల్లేష్ యాదవ్, జ్యోతి మురళి, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, బోధన్:** పల్లె దవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సాలూర మండలంలోని హున్సా గ్రామంలో బుధవారం పల్లె దవాఖానాను ప్రారంభించారు. హున్సాలో 'మహాలక్ష్మి మాత' విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సమస్యను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని డీఈవో అశోక్‌ను ఆదేశించారు. కుమ్మన్‌పల్లి రోడ్‌లో వంతెన సమస్యను తెలుపగా వెంటనే పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ దేవతల ఆలయాల ఎదుట సీసీ రోడ్, బీరప్ప గుడి వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఉర్దూ



అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, నాగేశ్వర్ రావు, నరేందర్ రెడ్డి, మందర్నా రవి, చీల శంకర్, సర్పంచ్ మార్కల్ శివకుమార్ పాల్గొన్నారు.

## 2న కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తలపెట్టిన కళాశాలల బంద్‌ను సక్సెస్ చేయాలని బీసీ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మీడియాతో మాట్లాడారు. బంద్‌లో భాగంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఎడ్, ఫార్మసీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఫిజియోథెరపీ తదితర కాలేజీలు బంద్ చేసి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతిలోనే ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీంను అమలు చేయాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదివేల ర్యాంకు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి బీసీజేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల మద్దతుతో బంద్ పాటిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు రేపటి బంద్ సహకరించి తమ కళాశాలలను బంద్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, శ్రీలత, బగ్గలి అజయ్, లక్ష్మణ్ గౌడ్, రేఖ, అవుసుల రాము తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పాఠశాలను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలను రాష్ట్రంలోనే మోడల్ పాఠశాలగా తీర్చిద్దుతామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రకటించారు. పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు.



### కార్పొరేట్ స్థాయిలో..

తాను విద్యాభ్యాసం చేసిన ఈ పాఠశాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిద్దుతున్నామని తెలిపారు. , జర్మన్ టెక్నాలజీతో డేలైట్ స్టేడియం ఏర్పాటుకు ఎంఎస్ఎన్ ఫార్మా సీఎస్ఆర్ కింద రూ.78 లక్షలు అందిస్తోందని వివరించారు.దోమకొండలో రూ.10 కోట్లతో ఫైర్ స్టేషన్, 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, తహశీల్దార్ కార్యాలయానికి పరిపాలనా అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారుజిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, ఐరేని సందీప్, భూమని బాలరాజ్, రెడ్డి నాయక్, రాజా గౌడ్, నౌసిలాల్ నాయక్ పాల్గొన్నారు.




## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పర్మల్లకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేరిన వారిలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, బద్ద చంద్రబాబు, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, గంట బాబు గ్రామానికి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కృషిచేసిన సర్పంచ్ బాబాయ్ నరేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిరాం యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు డిష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనం తనిఖీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎంపీడీవో గంగాధర్, ఎంఈవో నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న భోజనం తీరు గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందేలా అన్ని పాఠశాలల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఓటరు సవరణపై సమీక్ష

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలం సుల్తాన్ నగర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యూసెన్స్ చేసిన ఇద్దరికి జైలు..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** డయల్ 100కు ఫోన్ చేసి న్యూసెన్స్ చేసిన ఇద్దరికి న్యాయస్థానం ఏడురోజుల జైలుశిక్ష విధించింది. ఈ మేరకు 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు వివరాలు వెల్లడించారు. ఆరో టౌన్ పీఎస్ పరిధిలోని శాస్త్రినగర్ గ్రామానికి చెందిన గంపల లక్ష్మణ్, సంపంగి బాలాజీ మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విలువైన సమయానికి వృథా చేశారు. ఈ క్రమంలో వారిద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి నిందితులకు ఏడురోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.




## గాంధారి సీహెచ్‌సీపై

# నిర్లక్ష్యమేలా..?

- పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మార్చినా వృథానే..
- 30 పడకలకే పరిమితం.. అమలు కాని 'అప్-గ్రేడేషన్' హామీలు
- కరెంటు పోతే ఆస్పత్రిలో చిమ్మచీకట్లు..



**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సామాజిక ఆరోగ్య కేంద్రంగా పేరు మారినప్పటికీ గాంధారి సీహెచ్‌సీలో సేవల తీరు ఏమాత్రం మారలేదు. ప్రస్తుతం వర్షా కాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అయితే అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్న ఆస్పత్రికి ఉన్నతాధికారులు సందర్శించి వెళ్లడమే తప్ప, అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యంగా మారాయి.**

**- అక్షరటుడే, గాంధారి**

గాంధారి మండల కేంద్రం చుట్టూ 45 గ్రామ పంచాయతీలు, వాటి అనుబంధ పల్లెలు ఉన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఉన్న జనాభాకు కేవలం 30 పడకల ఆస్పత్రి ఏమాత్రం సరిపోదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల పర్యటనకు వచ్చిన అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీని.. సీహెచ్‌సీగా మార్చినప్పటికీ మౌలిక సదుపాయాలు పెంచలేదు. ప్రముఖులు వచ్చినప్పుడు వంద పడకల ఆసుపత్రిగా మారుస్తామని వరాల జల్లు కురిపించడం తప్ప, ఆచరణలో అడుగు ముందుకు పడలేదు.

### అందుబాటులో లేని గైనకాలజిస్ట్..

ఈ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా గర్భిణులకు, బాలింతలకు అవసరమైన గైనకాలజిస్ట్ అందుబాటులో లేరు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను కామారెడ్డి లేదా బాన్సువాడ ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోంది. డే అండ్ నైట్ డ్యూటీ డాక్టర్లు సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో, కేవలం నర్సులే ఇక్కడ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తే మెరుగైన వైద్యం అందించడానికి సిద్ధంగా ఉన్నామని స్థానిక సిబ్బంది చెబుతున్నారు. అలాగే ఆస్పత్రి చుట్టూ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఆస్పత్రిలో వాడేసిన సెలైన్ బాటిళ్లు, వేస్టేజ్‌ను ఇష్టారాజ్యంగా పడేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### జనరేటర్ లేకపోవడంతో..

ఆస్పత్రిలో మొత్తం 42 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, సాధారణ రోజుల్లో పదిమంది సిబ్బంది కూడా ఉండట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే ఎవరైనా ఎమ్మెల్యేలు, అధికారులు లేదా వీఐపీలు వస్తున్నారంటే మాత్రం సిబ్బంది మొత్తం హాజరవుతుండటం గమనార్హం. వీటన్నింటికీ తోడు, ఆస్పత్రిలో కనీసం జనరేటర్ లేదు. కరెంట్ పోతే ఆస్పత్రి చీకటిమయంగా మారుతోంది. అత్యవసర సమయాల్లో వాడుకోవడానికి కనీసం ఇన్వర్టర్, చార్జింగ్ లైట్లు లేదా జనరేటర్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది.

### నా వంతు సహాయం అందిస్తా..

గాంధారి మండల కేంద్ర పర్యటనలో భాగంగా ఆస్పత్రి దుస్థితిని పరిశీలించాను. ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి రోగులు రావడానికే భయపడేలా అపరిశుభ్రంగా ఉంది. తక్షణమే ఆసుపత్రి ప్రాంగణాన్ని చదును చేయించి, రూపురేఖలు మార్చడానికి నా వంతు ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాను.

**– డాక్టర్ పైడి ఎల్లారెడ్డి, బీజేపీ సీనియర్ నేత**

### వంద పడకల ఆస్పత్రి అవసరమే..

గాంధారి మేజర్ గ్రామ పంచాయతీతో పాటు చుట్టుపక్కల 45 గ్రామాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడున్న 30 పడకలు ఏమాత్రం సరిపోవు. విషయాన్ని అప్పటి మంత్రి హరీష్‌రావుతో పాటు, ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాం. అవి త్వరగా అమల్లోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

**– డాక్టర్ సంగీత్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్**



## మంత్రి పొన్నంను కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు

**అక్షరటుడే, ఆర్మూర్:** రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు డీవీఎస్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, సుంకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత విధానంలోనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రేపు రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ ప్రకటించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా 14 లక్షల మంది విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వినోద్, ప్రకాష్, రవి, సురేష్, రాజు, ప్రశాంత్, నవీన్, మున్నా, వినయ్, అక్షయ్, రాజేందర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన దర్శి పోశెట్టి ఇటీవల మరణించారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా బుధవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కౌన్సిలర్ శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ 8వ వార్డు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. వార్డులో ఎవరికి కష్టం వచ్చినా తాను ముందుంటానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు తన సొంత నిధుల నుంచి కూడా పేదలకు అండగా నిలుస్తున్నానని చెప్పారు. వార్డు ప్రజల ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి చట్టాన్ని ఎప్పటిలాగే కొనసాగించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎప్పటిలాగే కొనసాగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. జూలై 1 నుంచి వీబీజీ రాంజీ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇది పూర్తిగా కూలీలకు వ్యతిరేక చట్టమన్నారు. పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. ఏళ్లుగా కొట్లాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చటానికి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రవి, జన్నపల్లి నడ్పి రాజన్న, గంగ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని ఎత్తొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్ శ్వేత సూర్యకాంత్, ఉమ్మడి మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బర్ల మధు, షాజీ పటేల్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ సమీపంలో రెండు బైక్‌లు ఢీ..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగర శివారులోని కలెక్టరేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నిజామాబాద్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన ఠాగూర్ తన బైక్ రిపేర్ కావడంతో మరో బైక్‌కు తాడు కట్టి బైపాస్‌కు తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ దాటిన తర్వాత రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్ ఠాగూర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ఠాగూర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. స్పందించిన 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



## రాంపూర్ రైతులు రీసర్వేకు సహకరించాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని రాంపూర్ గ్రామ రైతులు భూభారతి రీసర్వేకు సహకరించాలని నిజామాబాద్ భూమి, కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. బుధవారం గ్రామంలో శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భూభారతి రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దానిలో భాగంగా ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుందని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో 10 రోజుల్లో సర్వేయర్‌తో సర్వే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ హెడ్‌క్వార్టర్ డీఐ జగన్నాథం, ఆర్మూర్ డీఐ శేఖర్ వర్మ, బోధన్ డీఐ దత్తు, సర్వేయర్ రత్నాకర్, సర్పంచ్ శూలం లావణ్య, జీపీవోలు పాల్గొన్నారు.




లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో..



బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం..

**జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఉమ్మడిజిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని.. దేవుళ్లకు మరోరూపం వైద్యులేనని వక్తలు పేర్కొన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు.**

**– అక్షరటుడే, నెట్‌వర్క్**

## చార్టర్డ్ అకౌంటెంట్ శ్రీజకు ఘన సన్మానం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో చార్టర్డ్ అకౌంటెంట్ రేగొండ శ్రీజను లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం చార్టర్డ్ అకౌంటెండ్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా నగరంలోని వైద్యులు విక్రం రెడ్డి, ఉషా నవన్ భాస్కర్, శరద్ జోషి, ఇన్నమూరి రవితేజ, పవన్‌కుమార్, వీవీఎస్, శ్యాంసుందర్, కొండ అమర్‌నాథ్‌లను సైతం లయన్స్ క్లబ్ సహారా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె అహ్మద్, కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, కోశాధికారి వివేకానంద్, జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రెటరీ ఉదయ సూర్య భగవాన్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ బొబ్బ నరసింహారావు, ఉపాధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.